క్లుప్తంగా

మన్ కీ బాత్ వీక్షణ

ఎంవీపీ కాలనీ: ప్రధాని మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యక్రమంలో ఆ పార్టీ నగర నాయకులు పెద్ద ఎత్తున వీక్షించారు. పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 115వ ఎపిసోడ్‌లో ప్రధాని దేశ ప్రజలతో మాట్లాడారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు మారుమూల ప్రాంతాల వాసులతో కూడా మోదీ ఈ కార్యక్రమం ద్వారా మమేకం కావడం గొప్ప విషయమన్నారు.

ఇసుకతోటలో అన్నదానం



అన్నదానంలో వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం: ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకదుర్గ అమ్మవారి వార్షిక ఉత్సవాలలో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని భక్తులకు అన్న వడ్డన చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథ చెబుతున్న సీతా శ్రీనివాస్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టెల్లింగ్ పిల్లలను అలరించింది. కథకురాలు సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో కథలు చెప్పి యువ మనసుల్లో ఊహ, సృజనాత్మకత వెలిగించారు. జూ డక్, ట్విన్ అండ్ ది ఫార్ అవే మౌంటైన్ కథలను చెప్పే విధానం ఆసక్తికరంగా సాగింది. పిల్లలు కథలు వినడంతోపాటు కథలకు సంబంధించిన ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. ముద్రించిన సాహిత్యాన్ని, వారి కలలను చిన్న చిన్న వర్క్ షీట్లపై పొందుపర్చారు. యాక్టివిటీలో భాగంగా పాటలు పాడటం, హ్యాండ్ ఆన్ యాక్టివిటీలు, బెలూన్ బ్లోయింగ్‌లో పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

తాటిచెట్లపాలెం : రైలులో అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు విశాఖపట్నం గరవ్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 13న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం చేరుకున్న అనంతరం రైలును నిర్వహణ పనుల నిమిత్తం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌కు తరలించారు. రైలు నిర్వహణ పనులు చేపడుతున్న సమయంలో జనరల్ కోచ్‌లో సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని క్లీనింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా దళ సిబ్బంది గుర్తించి, వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఈ వృద్ధురాలు శనివారం రాత్రి మృతిచెందింది. ఈ మహిళకు సంబంధించి ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, ఈమె సుమారు 5 అడుగుల ఎత్తు, పసుపు, నలుపు రంగులు గల నైటీ ధరించి, చామనచాయలో ఉందని జీఆర్పీ సిబ్బంది తెలపారు. ఈమె గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు కోరారు.



కూలిన సోలార్ విద్యుత్ స్తంభం



పార్కులో పిచ్చి మొక్కలు



10వ వార్డులో కళా విహీనంగా వివేకానందనగర్ పార్కు

కళా విహీనం



పాడైపోయిన జారుడు బల్ల



పార్కులో చేరిన నీరు.. అక్కడే ఆడుకుంటున్న బాలుడు

- వివేకానందనగర్ పార్కుపై నిర్లక్ష్యం
- శిథిలావస్థలో ఆట పరికరాలు, బెంచీలు
- ఇబ్బంది పడుతున్న పిల్లలు, పెద్దలు
- పార్కు దుస్థితిని పట్టించుకోని అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో పిల్లలు ఆడుకునే పార్కు శిథిలావస్థకు చేరింది. జీవీఎంసీ ఉద్యానవనాధికారుల నిర్లక్ష్యంతో పిల్లలు సైతం ఆడుకోవడానికి వీలులేని పరిస్థితికి చేరింది. వార్డులోని వివేకానందనగర్‌లో ఆదర్శనగర్ నుంచి రవీంద్రనగర్ వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని వినాయక గుడి ఎదురుగా జీవీఎంసీ ఏడేళ్ల కిందట ఈ పార్కును నిర్మించింది. అధికారులు ఇందులో పిల్లలు ఆటలాడుకోవడానికి ఊయలలు, జారుడు బల్లలు తదితర ఆట పరికరాలు అమర్చారు. పెద్దలు సేదదీరడానికి సిమెంట్ బెంచీలు నిర్మించారు. రోడ్డు పక్కన పార్కుకు ఇనుప గ్రిల్స్ అమర్చారు. పార్కులో ఆహ్లాదం కోసం పచ్చిక లేన్స్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు రెండేళ్ల కిందట జీవీఎంసీ అధికారులు పలు రకాల జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవన్నీ శిథిలావస్థకు చేరాయి. ఆట పరికరాలు, సిమెంట్ బెంచీలు విరిగిపోతున్నాయి. కొన్ని తుప్పుపట్టాయి. పార్కులో పచ్చదనం మాయమై గోతులు పడింది. వర్షం కురిసినప్పుడు ఆ గోతుల్లో నీరు చేరి బురదమయమవుతోంది.



శిథిలమైన సిమెంట్ బెంచీ

పశువుల బెడద, అంధకారం

పార్కు లోపలకు పశువులు ప్రవేశించి తిరుగుతూ మూత్రం, పేడ విసర్జన చేయడంతో అస్తవ్యస్తంగా మారిపోయింది. అక్కడ పశువులు, బురద నీటితో నిండిన గుంతల మధ్య పిల్లలు ఆటలాడుకోవాల్సి వస్తోంది. మరో పక్క పార్కు లోపల చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నా వాటిని తొలగించేవారు కరువయ్యారు. ఈ పార్కులో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు ఇటీవల నేలకొరిగాయి. దీంతో రాత్రిళ్లు ఈ పార్కులో అంధకారం నెలకుంటోంది. సాయంత్రం సమయంలో పిల్లలు ఆటల కోసం వెళ్లడం మానేశారు. పెద్దలు సేదతీరడానికి అటువైపు వెళ్లడం లేదు. ఈ చీకటి గంజాయి, మందుబాబులకు కలిసివచ్చింది. చీకటిలో వారిపని వారు చేసుకుపోయి మత్తులో జోగుతున్నారు. రహదారిలో వెళ్లేవారు కొన్నిసార్లు మందుబాబులు చేసిన హడావిడికి ఇబ్బంది పడుతున్నారని స్థానికులు అంటున్నారు. ఈ పార్కులో సౌకర్యాలు కల్పించి, అందంగా తీర్చిదిద్దాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను స్థానికులు కోరుతున్నారు.

శ్రావ్యంగా భక్త మార్కండేయ హరికథ



మార్కండేయ హరికథను వినిపిస్తున్న వేదవతి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హరికథ ఉత్సవాలలో భాగంగా మూడో రోజు ఆదివారం భక్త మార్కండేయ హరికథను ఒంగోలుకు చెందిన వేదవతి భాగవతారిణి అద్భుతంగా వినినించారు. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం వేదవతి భక్తమార్కండేయ కథను శ్రావ్యంగా ఆలపించి అలరించారు. అనంతరం ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ మూడు రోజుల హరికథ ఉత్సవాలకు అద్భుతమైన స్పందన లభించిందన్నారు.

హెపటైటిస్‌పై ఖైదీలకు అవగాహన



జైల్‌లో హెపటైటిస్‌పై అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో జైల్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఖైదీలకు హెపటైటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖైదీలు హెపటైటిస్ పట్ల పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం లెప్రా సంస్థ ప్రతినిధి ఐ.శ్రీనివాసరావు హెపటైటిస్‌కు సంబంధించిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఖైదీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైల్ వైద్య సిబ్బంది, వార్డర్లు పాల్గొన్నారు.

టమాటాకు బారులు



ఎంవీపీ రైతుబజార్‌లో టమాటాల కోసం క్యూలో వినియోగదారులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటాలకు వినియోగదారులు ఆదివారం బారులు తీరారు. టమాటా కిలో రూ.32కు విక్రయించే కౌంటర్‌ను రైతుబజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో వినియోగదారులు రైతుబజార్‌కు వెళ్లి టమాటా కొనుగోలు చేశారు. ఒక్క రోజే 74 క్వింటాళ్ల టమాటా విక్రయం జరిగినట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర విభజనతో వనరులు కోల్పోయిన ఏపీ



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

డాబాగార్డెన్స్: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దును రిటైర్డ్ ఐఏఎస్, పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ స్వాగతించారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి-తక్షణ కర్తవ్యాలపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రైతుల్లో గందరగోళ పరిస్థితి కల్పించిందని, ఫలితంగా భూకబ్జాలు, ఆక్రమణకు అవకాశం వచ్చిందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వనరులు కోల్పోయిందన్నారు. 58 శాతం జనాభాతో 46 శాతం మాత్రమే ఆదాయాన్ని పొందామన్నారు. 42 శాతం జనాభా గల తెలంగాణ 54 శాతం ఆదాయాన్ని పొందిందని చెప్పారు. అభివృద్ధికి కేంద్రమైన హైదరాబాద్‌ను కోల్పోయామన్నారు. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల రాష్ట్రంగా మారిందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో అతి తక్కువ పట్టణీకరణ జరిగిన రాష్ట్రంగా ఉందని చెప్పారు. జన చైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు రాష్ట్రానికి రప్పించుకోవాలని, ఆయా ప్రాజెక్టులకు కావల్సిన భూమి, నగదు వాటాను చెల్లించి ప్రాజెక్టులు, స్కీంలు రాష్ట్రానికి తెప్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.హరి ప్రకాష్, పూర్వ వైస్ చాన్సలర్స్ ఆర్. సుదర్శనరావు, ఎస్. రామకృష్ణారావు, ప్రొఫెసర్ అవధాని, ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గంగారామ్, మరుపిల్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



సమాచార శాఖ విశ్రాంత డివిజనల్ అధికారి సాయిబాబాను సత్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పింఛన్లలో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర ట్రెజరీ అకౌంట్స్ డైరెక్టర్ ఎం. మోహన్‌రావు తెలిపారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ పింఛనుదారుల సంఘ కార్యాలయంలో సమాచార శాఖ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. పింఛన్‌దారులు సర్వీసు పింఛను, కుటుంబ పింఛనుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రాయింగ్ అధికారి, ఎస్టాబ్లిష్‌మెంట్ గుమస్తా నిబద్ధతతో పింఛను పేపర్లు పంపించవలసి ఉంటుందన్నారు. ఉద్యోగి మరణ ధ్రువపత్రం, సరైన రీతిలో వివరాలు ఉంటే వెంటనే పింఛన్ మంజూరు అవుతుందన్నారు. అధ్యక్షుడు ఆర్. త్యాగరాజు మాట్లాడుతూ పింఛన్ ఫారాలు సక్రమంగా పూర్తి చేసి పంపాలన్నారు. సమాచార శాఖ ఆర్‌జేడీ వి.మణిరామ్, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పి.గోవిందరావు తదితరులు మాట్లాడారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. పెన్షనర్ల సంఘం నాయకులు డీడీ ప్రసాదరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శ్రీను

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్‌ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆచార్య బాల మోహన్‌దాస్

డాబాగార్డెన్స్: పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధం సమసిపోవడానికి ఐక్య రాజ్యసమితి గట్టి ప్రయత్నం చేయాలని, వీటో దేశాలను నియంత్రించాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఇస్కఫ్, గ్లోబల్ నెట్‌వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పాలస్తీనాకు సంఘీభావ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల అక్కడి ప్రజల జీవన విధానం ఛిద్రమైందన్నారు. ఆస్పత్రులను సైతం నేలమట్టం చేయడంతో యుద్ధ ఖైదీలు, పిల్లలు మృత్యువాత పడతున్నారన్నారు. ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాక ఉద్రిక్త పరిస్థితి నెలకొందని, గాజాను ఆక్రమించి యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. పాలస్తీనా గతంలో భారతదేశం మద్దతు కోరిందని, అయితే ఇటీవల ఇజ్రాయిల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించాక పరిస్థితులు మారాయన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, దేవా, సుకుమారన్, శ్యామ్‌సుందర్, మణి తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యపై తస్మాత్ జాగ్రత్త



సూచనలిస్తున్న ఈ వింగ్స్ డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్

డాబాగార్డెన్స్: విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకునే వారు జాగ్రత్తగా ఉండాలని ఈవింగ్ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 15 వేలకు పైగా విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుకోవడానికి విదేశాలకు వెళ్తున్నారని చెప్పారు. గతంలో విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎఫ్ఎంజీఈ పరీక్షల్లో ఉత్తీర్ణత అయితే డాక్టర్ లైసెన్స్ ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం అనేక నిబంధలు వచ్చాయన్నారు. ఎన్ఎంసీ రూల్స్ పాటించే దేశాల్లో చదివితేనే ఇండియాలో ఎంబీబీఎస్ డిగ్రీ చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఏ దేశాల్లో చదివితే ఎంబీబీఎస్ డిగ్రీ ఇండియాలో చెల్లుబాటు అవుతుందో తెలుసుకోవాలంటే 8806688068 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్: బాల్యం ఎంతో మధురమైనదని, ఆ దశలోనే వారంతా క్రీడల్లో పాల్గొంటే ఉల్లాసంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఎస్ఐబీవోజీ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, పీత్రమ్ స్పష్టం చేశారు. డాబాగార్డెన్స్‌లో గల చిల్డ్రన్స్ ఫేజ్-3 ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ ఇండియా ఒలింపిక్ బేబీ గేమ్స్-2024 ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పలువురు చిన్నారులు బుడి బుడి అడుగులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ బాల్యం నుంచే ఆట పోటీల్లో చిన్నారులు పాల్గొనడం ద్వారా వారిలో భయాందోళనలు పోతాయన్నారు. తద్వారా క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలో నిలిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

విమ్స్‌కు రోగుల తాకిడి



విమ్స్ ఓపీ వద్ద రోగులు, వారి కుటుంబ సభ్యులతో రద్దీ



మందుల కోసం కౌంటర్ వద్ద క్యూ

ఆరిలోవ: వర్షా కాలం కావడంతో నగరవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో జ్వరాలతో పాటు సాధారణ వ్యాధుల కోసం వెళ్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. సుమారు వారానికి పైగా కురిసిన వర్షాలకు ఎక్కువ మంది జ్వరాల బారిన పడ్డారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వేర్వేరు వ్యాధులతో వచ్చే వారితో పాటు ఆరిలోవ, విశాలాక్షినగర్, హనుమంతవాక, డెయిరీఫారం, ఆదర్శనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఇందిరానగర్, తదితర ప్రాంతాల నుంచి జ్వరాలతో బాధపడుతున్నవారు అధిక సంఖ్యలో రోజూ విమ్స్‌కు వైద్యం కోసం వెళ్తున్నారు. దీంతో విమ్స్‌లో వారం రోజులుగా రోగులు, వారిని తీసుకెళ్తున్న బంధువులతో రద్దీగా మారింది. ఓపీ వద్ద పేర్లు నమోదు కోసం, రోగులను వైద్యులు పరీక్షించిన అనంతరం రాసిన మందులు కోసం కౌంటర్ వద్ద రోగులు, వారి బంధువులు క్యూ కడుతున్నారు. సాధారణంగా రోజుకు 600 నుంచి 700 వరకు ఓపీ నమోదవుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. వారం రోజులుగా ఓపీ పెరిగి రోజుకు 650 నుంచి 800 మధ్యలో నమోదు అవుతుందన్నారు.

న్యాయం చేయాలని మొర

మహారాణిపేట: తమను ఇబ్బందులకు గురి చేస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. సెంట్రల్ ఫార్మసీలో జాబ్ మేళా ద్వారా రెడ్డి ఫౌండేషన్‌లో ఉద్యోగంలో చేరిన తమను గత రెండు సంవత్సరాలుగా అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగపోతే మళ్లీ ఆందోళనకు దిగుతామని, కలెక్టర్‌ను కూడా కలిసి తమకు న్యాయం చేయమని కోరుతామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కార్మికుల పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వేధింపులు భరించలేక దాదాపు 80 మందికి పైగా బయటకు వచ్చేశారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'శ్రీమద్రామాయణం' వ్యాస సంపుటి ఆవిష్కరణ



గరికిపాటి నరసింహారావుకు పుస్తకాన్ని అందిస్తున్న ఆవిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ

సీతంపేట: వాల్మీకి రామాయణంలో రాముడు సాధారణ మానవుడని, విశ్వనాథ వారి రామాలయలో రాముడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడని(విష్ణువు) ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము, ఉదాత్త కల్పనలు' వ్యాస సంపుటిని ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకులుగా, బాలకాండపై వ్యాసం రాయగా, ఐదుగురు గొప్ప సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు వెంకటేశ్వర్లు, కడిమిళ్ల వరప్రసాద్, పేరి రవికుమార్ ఐదు కాండాలకు వ్యాసాలు రాయడం, అటువంటి గొప్ప వ్యాస సంపుటి ఆవిష్కరణకు అవకాశం కల్పించడం అంతా రాముని దయగా పేర్కొన్నారు. ఉదాత్త కల్పనల వల్లే రామాయణానికి గొప్ప మహత్తు వచ్చిందన్నారు. విశ్వనాథ వారి రచన ఊహకందదని, పాత్ర ప్రవేశం చాలా గొప్పగా వర్ణిస్తారన్నారు. తొలి ప్రతిని విశ్వనాథ మనువడు విశ్వనాథ సత్యనారాయణకు అందజేశారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గరికిపాటి నరసింహారావుకు మరో ప్రతిని అందించారు. సభాధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ రామాయణంపై విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో వరుసగా మూడు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రాముని వల్లే లభించిందన్నారు. వినూత్న రీతిలో వ్యాసకర్తలే సమీక్షించడం విశేషమని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ మాట్లాడుతూ తాత గారు రాసిన మూల గ్రంథాలన్నీ అచ్చువేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విశ్వనాథ తండ్రి శోభనాద్రి ఆజ్ఞతో తాతగారు రామాయణం రాశారని తెలిపారు. చివరగా గరికిపాటి నరసింహారావు ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు.